
సంస్కరణలకు శ్రీకారం..!


రాజీవ్‌గాంధీ 1985లో ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక... దేశ ఆర్థిక విధానాల్లో సరికొత్త మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించడం.. విస్తృత పరచడం.. కొత్తవిధానం ప్రధాన ఉద్దేశంగా మారింది! ప్రయివేటురంగానికి సుహృద్భావ వాతావరణాన్ని కల్పించి... తద్వారా దేశ ఆర్థికాభివృద్ధిలో ఆ రంగం కీలక పాత్ర పోషించేలా తీర్చిదిద్దాలని ప్రభుత్వం భావించింది. ఎగుమతి-దిగుమతి విధానం, పారిశ్రామిక లైసెన్సింగ్, సాంకేతిక పరిజ్ఞానం పెంపుదల, కోశ విధానం, విదేశీ ఈక్విటీ మూలధనం, ఆంక్షల తొలగింపు ద్వారా.. ప్రయివేటురంగంలో నూతన ఉత్తేజాన్ని నింపేందుకు కేంద్రం పలు చర్యలు చేపట్టింది!!

1991లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినపుడు భారతదేశ ఆర్థికవ్యవస్థ తీవ్ర సంక్షోభ స్థితిలో ఉంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు తీవ్రమవడం, చెల్లింపుల శేషంలో సంక్షోభస్థితి లాంటి సమస్యలతో... ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్థ స్థితికి చేరుకుంది. ఆ పరిస్థితి అలాగే కొనసాగితే మొత్తం వ్యవస్థ ఉనికికే ముప్పు వాటిల్లేది! ఆర్థిక లోటును భర్తీచేసి.. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించి.. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం నాడు తక్షణ కర్తవ్యమైంది. ఇందుకోసం స్వల్పకాలిక చర్యలతోపాటు నిర్మాణాత్మక సంస్కరణలను చేపట్టడం తప్పనిసరైంది. స్థూల ఆర్థిక సంతులనాన్ని కాపాడి, ప్రగతికి దోహదంచేసే నూతన విధాన నిర్ణయాలను నాటి ప్రభుత్వం తీసుకోవలసి వచ్చింది. 1991 జులై నుంచి కేంద్ర ప్రభుత్వం దేశంలో ఆర్థిక సంస్కరణలను అమలు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనేక రంగాల్లో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టాయి. పారిశ్రామిక రంగం, పన్నుల వ్యవస్థ, విదేశీ వాణిజ్యం, బీమారంగం, మూలధన మార్కెట్‌లో సంస్కరణలు చేపట్టారు. సంస్కరణల ప్రక్రియ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని చెప్పవచ్చు. సంస్కరణల ప్రభావం ఆర్థికాభివృద్ధిపై వెంటనే కనిపించిందు. అది దీర్ఘకాలిక ప్రక్రియ!

స్థూల దేశీయోత్పత్తిలో(GDP) వృద్ధి:

ఆర్థిక సంస్కరణలు ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేయగలవనడంలో ఎలాంటి సందేహం లేదు. సంస్కరణల ముందు కాలంలో.. 1980-





81 నుంచి 1990-91 మధ్య... సగటు వార్షిక జీడీపీ రేటు 5.6% కాగా... సంస్కరణల యుగంలో.. ఒక దశాబ్ద కాలంలో.. 1990-91 నుంచి 2000-01 మధ్య.. జీడీపీ రేటు 5.6% గానే ఉన్నప్పటికీ... 2000-01 నుంచి 2005-06 మధ్య సగటున 7శాతం వృద్ధి సాధించింది. 2006-07లో 9.6 శాతం, 2007-08లో 8.7 శాతంగా జీడీపీ నమోదైంది. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో ఏర్పడిన సంక్షోభం వల్ల.. సంస్కరణల యుగంలో మొదటి దశాబ్దకాలంలో సగటు వార్షిక వృద్ధి రేటులో పెద్దగా ప్రగతి కనిపించలేదు. 2004-05 నుంచి 2007-08 వరకు తయారీ రంగ ఉత్పత్తుల్లో వృద్ధి, రుతుపవనాలు అనుకూలించడం, దేశవ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తులు పెరగడం, రవాణారంగం, నిర్మాణరంగం ఊపుమీదుండటంతో.. జీడీపీలో అధికవృద్ధి సాధ్యమైంది.

పేదరికం :

1983లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి సంఖ్య మొత్తం జనాభాలో 44.48 శాతం. 1990-91 నాటికి అది 35.11 శాతానికి తగ్గింది. 1983 లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాభా 323 మిలియన్లు. 1990-91 నాటికి ఆ సంఖ్య 291 మిలియన్లు అయింది. 1990-91 నుంచి 1997 వరకు.. పరిశీలిస్తే... పేదరికం 35.1% నుంచి 37.23% కు పెరిగింది. 1997లో మొత్తం జనాభాలో.. 349 మిలియన్ల (37.23%) మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నట్లు అంచనా. నేషనల్ శాంపిల్ సర్వే గణాంకాల ఆధారంగా(1999-2000)... దేశంలో 26.1 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువ ఉన్నట్లు ప్రణాళికా సంఘం పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో 27.09%, పట్టణ ప్రాంతాల్లో 23.62 శాతం మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు. 10వ పంచవర్ష ప్రణాళికాంతానికల్లా (2007 మార్చి నాటికి) దేశంలో పేదరికాన్ని 20 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా నిర్ణయించారు. 2004-05లో నేషనల్ శాంపిల్ సర్వే ప్రకారం... గ్రామీణ ప్రాంతాలలో 28.3%, పట్టణ ప్రాంతాలలో 25.7% మంది ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం:

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2006, ఫిబ్రవరి 2న ప్రారం

భమైంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారి కుటుంబంలో ఒకరికి ఏడాదిలో 100 రోజుల పాటు ఉపాధి కల్పించడం దీని లక్ష్యం. ఈ పథకం అమలు చేయడం ద్వారాపేదల జీవన ప్రమాణాలు పెంచి, దేశంలో పేదరికాన్ని తగ్గించాలని ప్రభు త్వం భావించింది. పేదరికం తగ్గాలంటే కొన్ని అంశాల్లో విధానపరమైన జోక్యం అవసరం. రవాణా సదుపాయాలు, విద్యుత్, విద్య, ఆరోగ్యం, వ్యవసాయ విస్తరణ కార్యకలాపాలు, లక్షిత వర్గాలకు పరపతి సౌకర్యాలను సులభతరం చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర ఉపాధి, సంక్షేమ చర్యలు తీసుకోవాలి. పేదరికం సమస్యను నివారించాలంటే.. దేశంలో స్థూల దేశీయో త్పత్తి (జీడీపీ)వృద్ధిరేటు పెరిగే విధంగా సంస్కరణ లను అమలు పరచాలి. ఆర్థిక కార్యకలాపాలు విస్త ృతమైనప్పుడు జీడీపీ వృద్ధిరేటు పెరుగుతుంది. ప్రభుత్వం ప్రోత్సాహక, రక్షణ విధా నాలను అమలుపరచడం ద్వారా... ఆర్థిక కార్యకలాపాలు వేగవంతమ య్యేలా కృషి చేయాల్సిన అవసరముంది. 2004-05లో 300 మిలియన్ల మంది దారిద్ర్యరేఖకు దిగువన ఉండగా... 1993-94లో 320 మిలియన్ల మంది పేదరికంలో ఉన్నారు. కాని సంస్కరణల ముందు కాలంలో.. 1973-74, 1987-88 మధ్య పేదరికం 54.9% నుంచి 38.9%కు తగ్గింది. దీనిని బట్టి సంస్కరణల కాలంలో పేదరికం క్రమేణా తగ్గుతు న్నట్లు చెప్పొచ్చు.

ఉద్యోగిత :

నిరుద్యోగిత, అల్ప ఉద్యోగిత, నాణ్యత గల ఉపాధి లేని స్థితి పేదరికా నికి కారణమవుతోంది. ఈ నేపథ్యంలో.. సంస్కరణల యుగానికి ముందు, ఆ తర్వాత కాలంలో ఉద్యోగితాస్థితిని పరిశీలించడం ఎంతో అవసరం. 1983లో మొత్తం ఉద్యోగిత 3,026 లక్షలుగా ఉంది. అది 1990-91 నాటికి 3,568 లక్షలకు, 1997-98 నాటికి 3829 లక్షలకు 1999-2000లో 3970 లక్షలకు పెరిగింది. 1983 నుంచి 1990-91 మధ్య కాలంలో.. వార్షిక ఉద్యోగితా వృద్ధిరేటు 2.39%. ఇది ఇదే కాలానికి సంబంధించిన శ్రామికశక్తి వృద్ధిరేటుకు సమానం. సంస్కర ణలు ప్రారంభమైన తర్వాత... 1990-91 నుంచి 1999-2000 మధ్య కాలంలో.. సగటు వార్షిక ఉద్యోగితా వృద్ధి 1 శాతం మాత్రమే.

15 ఏళ్ల కాలంలో 2.4 శాతం:

9వ ప్రణాళిక తన పత్రంలో.. 1997-2002 మధ్యకాలంలో.. శ్రామిక శక్తి వార్షిక వృద్ధి 2.5% ఉండగలదని.. ఆ తర్వాత 15 సంవత్సరాల కాలంలో 2.4% ఉంటుందని అంచనా వేసింది. గ్రామీణ ప్రాంతాల్లో సగటు వార్షిక వృద్ధి 1983-88 మధ్య కాలంలో 1.36 శాతం. సంస్క రణల యుగంలో (1993-94 నుంచి 1999-2000) మధ్య 0.66 శాతం మాత్రమే. పట్టణ ప్రాంతాల్లో 1983-88 మధ్య సగటు వార్షిక ఉద్యోగితా వృద్ధి 2.77%. 1993-94 నుంచి 1999-2000 మధ్య వృద్ధి 2.27% మాత్రమే.సంఘటిత రంగంలో సగటు వార్షిక ఉద్యోగితా వృద్ధి 1983-94 మధ్య 1.20% కాగా...1994-2004 మధ్య రుణాత్మక వృద్ధి నమోదు చేసుకుంది(-0.38 శాతం). దీనిని బట్టి సంస్కరణల యుగంలో సంఘటిత రంగంలో ఉపాధి వృద్ధి సంస్కరణల ముందు కాలం కన్నా తక్కువ.

పెరిగిన నిరుద్యోగిత:

ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని తీసుకుంటే... యూజువల్ స్టేటస్ ప్రకారం నిరుద్యోగిత వృద్ధి 1993-94లో 2.62% నుంచి 1999-2000కు 2.78%కు 2004-05లో 3.1%కు పెరిగింది. రోజువారీ స్థితి ఆధారం గా నిరుద్యోగిత 1999-2000లో ఉన్న7.3% నుంచి 2004-05లో 8.3% కు పెరిగింది. ఒకవైపు ఇటీవల కాలంలో స్థూల దేశీయోత్పత్తి వృద్ధి పెరుగుతున్నప్పటికి నిరు ద్యోగిత వృద్ధిలో తగ్గుదల లేనందు వల్ల సరైన ఉపాధి వ్యూహా లను అమలు పరచాలి.

ముఖ్యంగా అధిక ఉద్యోగిత కల్పించగలిగే రంగాలైన వ్యవసా యం, అనుబంధాలు, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, రిటైల్‌రంగం, ఐ.టి రంగం, గ్రామీణ ప్రాంతాలలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్స్ ఏర్పాటు చేయుట ద్వారా ఉపాధి అవకాశాలు పెంచాలి!!